క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న నాయకులు

ఏలూరు(మెట్రో) : ఏలూరు జెడ్పీ కార్యాలయం వద్ద ఏపీఎన్‌జీవోస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జెడ్పీ సీఈఓ సుబ్బారావు గురువారం ప్రారంభించారు. ఏపీ ఎన్జీజీవోస్ అసోసియేషన్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావులు మాట్లాడుతూ వేసవి తాకిడికి ప్రజలకు అందుబాటులో ఉండేలా చలివేంద్రం ప్రారంభించామన్నారు. రాష్ట్ర అసిస్టెంట్ సెక్రెటరీ జనరల్ ఆర్ఎస్ హరనాథ్, ఏలూరు తాలూకా అధ్యక్షుడు ఎ.శ్రీధర్‌రాజు, సెక్రటరీ కప్పల సత్యనారాయణ, అసోసియేషన్ మహిళా విభాగం చైర్‌పర్సన్ కె.నాగమణి, నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): వట్లూరు విద్యుత్ సబ్ స్టేషన్ సత్రంపాడు ఫీడర్‌లో చెట్ల కొమ్మలు తొలగింపు నిమిత్తం ఈ నెల 20వ తేదీ శనివారం నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జేపీబీ నటరాజన్ తెలిపారు. సత్రంపాడు ప్రాంతం, మంగా నర్సింగ్ హోమ్ ప్రాంతం ఎన్‌టీఆర్ విగ్రహం ప్రాంతం, విద్యా వికాస్ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ నిలిపివేస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవాలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక అగ్రహారంలోని గంగా వింధ్యవాసినీ సమేత నగరేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 19 నుంచి నిర్వహించనున్నట్టు దేవస్థానం కార్యనిర్వహణాధికారి గుబ్బల రామ పెద్దింట్ల రావు తెలిపారు. 19న ఉదయం స్వామి వారిని, పెండ్లి కుమారుని చేస్తారని, సాయంత్రం గణపతి పూజ, ధ్వజారోహణ ఉంటుందని పేర్కొన్నారు. 20, 21 తేదీల్లో ఉదయం, రాత్రి హోమాలు, బలిహరణ పూజలు చేస్తారని తెలిపారు. 22న ఉదయం, రాత్రి హోమాలు, బలిహరణలు, సాయంత్రం ఎదురుకోలు సన్నాహం, రాత్రి స్వామి కల్యాణ మహోత్సవం, 23న సాయంత్రం స్వామివారి రథోత్సవం నిర్వహిస్తామని వివరించారు. 25న ఉదయం ఉత్సవ పూర్ణాహుతి, రాత్రి పవళింపు సేవ ఉంటుందని తెలిపారు.



చాణక్యపురి కాలనీలో నానిని భారీ గజమాలతో స్వాగతిస్తున్న అభిమానులు



లూథరన్ చర్చి వద్ద నానిని ఆశీర్వదిస్తున్న పాస్టర్



ఎమ్మెల్యే నాని, ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు గజమాలతో దళిత నేతల స్వాగతం

కదంతొక్కిన అభిమాన జనం

- ఎమ్మెల్యే అభ్యర్థి ఆళ్ల నాని నామినేషన్ దాఖలు
- వాడవాడలా అపూర్వ స్వాగతాలు
- తీన్మార్‌లు, డీజేలు, బాణసంచాలతో సందడిగా పాదయాత్ర
- హాజరైన ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్, దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి





ఎమ్మెల్యే నాని తనయుడు ఆశీష్

ఏలూరు టౌన్: వైఎస్సార్ సీపీ ఏలూరు అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు సందర్భంగా గురువారం చేపట్టిన పాదయాత్రలో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు కదంతొక్కారు. మండుటెండను సైతం లెక్కచేయకుండా వారంతా నానితో కలిసి అడుగులు వేశారు. నానికి మహిళల మంగళహారతులు పట్టారు. ప్రతి సెంటర్‌లోనూ భారీ గజమాలలు, పూలమాలల వేశారు. తీన్మార్ డబ్బులు, డీజే బాక్సులు, యువత, నేతలు, మహిళల నృత్యాలు, భారీగా బాణసంచా కాల్పులు, విచిత్ర వేషధారణలతో జనజాతరలా పాదయాత్ర సుమారు 3.30 గంటలపాటు సాగింది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఏలూరు వన్‌టౌన్ తహసీల్దార్ కార్యాలయంలో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం ముక్కంటికి నాని నాలుగు సెట్ల నామినేషన్ దాఖలు చేశారు. నాని వెంట ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి ఉన్నారు.

శ్రీరామ్‌నగర్ నుంచి పాదయాత్ర

ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని స్వగృహం నుంచి నాని పాదయాత్ర ఉదయం 9.15 గంటలకు ప్రారంభమైంది. శ్రీరామ్‌నగర్ 9వ రోడ్డు నుంచి శనివారపుపేటకు వెళ్లే ప్రధాన రహదారి మీదుగా డాక్టర్ వైఎస్సార్ సర్కిల్ చేరింది. ఒక్కో ప్రాంతంలో ఒక్కో నాయకుడు ఎమ్మెల్యే నాని పాదయాత్రలో కలుస్తూ ఆయన వెంట నడిచారు. అమీనాపేట లూథరన్ చర్చి వద్ద చర్చి పాస్టర్ ఎమ్మెల్యే నానిని కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, ఆశీర్వదించారు. అనంతరం అశోకచక్రం రోడ్డు, పత్తేబాద డీ-మార్ట్ సెంటర్, 12 పంపుల సెంటర్, నూకాలమ్మ గుడి వద్ద మహిళలు ఆళ్ల నాని విజయాన్ని కాంక్షిస్తూ గుమ్మడి కాయలతో దిష్టి తీశారు. ఆదివారపుపేట మార్కెట్, ఏఎస్ఆర్ స్టేడియం సెంటర్, పాతబస్టాండ్ సెంటర్, బిర్లాభవన్ సెంటర్, గడియార స్తంభం సెంటర్ మీదుగా తహసీల్దార్ కార్యాలయానికి పాదయాత్ర చేరింది. ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్ కుమార్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఇడా చైర్మన్, పార్టీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ క్లస్టర్-1, -3 అధ్యక్షులు సుంకర చంద్రశేఖర్, మంచెం మైబాబు, కోఆప్షన్ సభ్యులు మున్నుల జాన్‌గురునాథ్, మాజీ జెడ్పీటీసీ నౌడు వెంకటరమణ, వడ్డీ కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్, మోరు రామరాజు, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు, పార్టీ ముఖ్యనేతలు, వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్‌సీపీ క్యాడర్, అభిమానులు పాదయాత్రలో నాని వెంట నడిచారు.

స్పెషల్ అట్రాక్షన్‌గా ఆశీష్

పాదయాత్రలో ఎమ్మెల్యే ఆళ్ల నాని తనయుడు ఆశీష్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఏలూరు నియోజకవర్గంలో ఏడు పర్యాయాలుగా ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీలో ఉంటూ.. మూడుసార్లు ఎమ్మెల్యేగా రికార్డ్ సృష్టించిన నాని ఇప్పటి వరకు కుటుంబ సభ్యులను ప్రచారాలకు తీసుకురాలేదు. తొలిసారిగా యువనాయకుడు ఆశీష్ తన తండ్రి నానితో కలిసి పాదయాత్రలో నడుస్తూ కనిపించారు. నగర ప్రజలు నాని కుమారుడు ఆశీష్‌ను చూస్తూ మురిసిపోయారు. తమ అభిమాన నేత కుమారుడితో కరచాలనాలు చేస్తూ, సెల్ఫీలు దిగారు. ఆశీష్ ఫ్యాన్ గుర్తును చూపిస్తూ ఓట్లు అభ్యర్థించారు.



నాని ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేస్తున్న అభిమానులు



పాదయాత్రలో బుట్టబొమ్మల సందడి





నూకాలమ్మ గుడివద్ద ఎమ్మెల్యే నానికి గుమ్మడికాయలతో దిష్టి తీసేందుకు సిద్ధంగా ఉన్న మహిళలు, ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ పేరుతో యువత స్వాగత ఫ్లెక్సీ



ఆదివారపుపేటలో స్వాగతం పలుకుతున్న ముస్లిం మైనార్టీ నేతలు

సీఎం జగనన్నతోనే పేదలకు మేలు



ఏలూరులో ప్రచారం చేస్తున్న ఇడా చైర్మన్ బొద్దాని శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ మాజీ చైర్‌పర్సన్ అఖిల

ఏలూరు టౌన్: రాష్ట్రంలో పేద, మధ్యతరగతి వర్గాల సంక్షేమంతోపాటు, విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని, మరోసారి ఆయన ముఖ్యమంత్రిగా అధికారం చేపడితే పేదలకు మరింత మేలు జరుగుతుందని ఏలూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, స్మార్ట్‌సిటీ మాజీ చైర్‌పర్సన్, కార్పొరేటర్ బొద్దాని అఖిల అన్నారు. వారిద్దరూ గురువారం సాయంత్రం ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని సత్యనారాయణ పేట, నవాబ్ పేటల్లో ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మే 13న జరిగే ఎన్నికల మహాసంగ్రామంలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు ఆళ్ల నాని, కారుమూరి సునీల్ కుమార్‌లకు ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి గెలిపించాలన్నారు. సీఎం జగన్ ఏలూరు నగరంలో ఐదేళ్లలో సంక్షేమ పథకాల రూపంలో ప్రజల బ్యాంకు ఖాతాల్లో రూ.447 కోట్లు జమ చేశారని తెలిపారు. ప్రతిపక్ష టీడీపీ కూటమి అబద్ధపు హామీలను ప్రజలు నమ్మవద్దని ప్రజలను సూచించారు. చంద్రబాబు 2014 నుంచి 2019 వరకూ మేనిఫెస్టోలోని హామీలను ఎందుకు అమలు చేయలేదని ప్రశ్నించారు. ఇప్పుడు సూపర్ సిక్స్ పేరుతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు కల్లబొల్లి మాటలు చెబుతున్నారని విమర్శించారు.

పాదయాత్రలో లీగల్ సెల్ నాయకులు



ర్యాలీలో పాల్గొన్న పార్టీ లీగల్ సెల్ నాయకులు



ఎమ్మెల్యే నానికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఉంగుటూరు పరిశీలకులు మామిళ్లపల్లి జయప్రకాష్

ఏలూరు (టూటౌన్): ఆళ్ల నాని నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు. ఆళ్ల నానికి ఆయన నివాసం వద్ద వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో పలువురు పీపీలు, ఏపీపీలు, జీపీ, ఏజీపీలు, న్యాయవాదులు స్వాగతం పలుకుతూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా నాని మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు తన వెంటే ఉన్నారని తెలిపారు. రాష్ట్రంలో అమలైన సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు జేజేలు పలుకుతూ మరోసారి జగన్ ప్రభుత్వానికి పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారని వివరించారు. నాని నామినేషన్ ర్యాలీలో పార్టీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు పితాని దుర్గాప్రసాద్, నాయకులు ప్రత్తిపాటి తంబి, కురెళ్ల ప్రసాద్, రంజన్, రామ్మోహన్‌రావు, పుండరీకాక్షుడు, అడిషనల్ పీపీలు డీవీ రామాంజనేయులు, ఆచంట వెంకటేశ్వరరావు, సీహెచ్ రాజేంద్రప్రసాద్, కోనే సీతారామ్, జీపీ బీజే రెడ్డి, ఏజీపీ కేవీపీ మాధవరావు, చిన్నం సుధీర్, స్టాన్లీ బాబు, ఎం రవి తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు ఎమ్మెల్యే నానిని కలిసిన జేపీ

ఏలూరు టౌన్: ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని మరోసారి చారిత్రక విజయాన్ని సాధించాలని, ఏలూరులో భారీ మెజార్టీతో గెలుస్తున్నారంటూ వైఎస్సార్ సీపీ ఉంగుటూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరు శ్రీరామ్‌నగర్ క్యాంపు కార్యాలయంలో గురువారం ఉదయం ఎమ్మెల్యే నానిని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వైఎస్సార్ సీపీ ఏలూరు అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసేందుకు పాదయాత్రగా బయలుదేరుతోన్న తరుణంలో ఎమ్మెల్యే నానిని కలిసి అభినందనలు తెలిపారు. ఏలూరులో ప్రతిపక్షాలకు చావుదెబ్బ ఖాయమని, రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే నాని గెలుపును ఎవరూ ఆపలేరని, ప్రజలంతా ఆయన వెంటే ఉన్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, ఎమ్మెల్యే నాని అభివృద్ధి, సంక్షేమంతో ఏలూరు ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. ఫ్యాను గుర్తుపై ఓట్లేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలన్నారు.

ఎంఈఓ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు



డీఈఓకు వినతిపత్రం అందిస్తున్న ఎస్టీయూ నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలోని గణపవరం మండల విద్యాశాఖాధికారి-1, నిడమర్రు మండల విద్యాశాఖాధికారి-1 ఎఫ్ఏసీగా పని చేస్తోన్న పుచ్చల శేషు దుర్వినియోగం చేసిన ప్రభుత్వ నిధులపై పూర్తి స్థాయిలో శాఖాపరమైన విచారణ చేయాలని ఎస్టీయూ జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్ అబ్రహాంకు గురువారం వినతిపత్రం అందజేశారు. పుచ్చల శేషు 2019, 2020, 2021 సంవత్సరాల్లో ప్రభుత్వం విడుదల చేసిన ఎంఆర్‌సీ గ్రాంటులు, ఆనంద వేదిక, అమ్మ ఒడి, శాలసిద్ధి, స్పోర్ట్స్, సమగ్ర అభ్యసనాభివృద్ధి పథకాలకు సంబంధించిన రూ.3.80 లక్షలను ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా దుర్వినియోగం చేసి అవినీతికి పాల్పడ్డారని తెలిపారు. ఈ మొత్తానికి సంబంధించిన బిల్లుల వివరాలను పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం శామ్యూల్, కేఆర్ పవన్ కుమార్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పీబీవీఎస్ఎల్ నారాయణ ఉన్నారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	26	అరటి కాయ (1)	05-07
వంకాయలు (గులాబీ)	34	చిక్కుడు కాయలు	80
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	--	ములక్కాదలు	04, 06
బెండకాయలు	26	కంద	64
పచ్చిమిర్చి	40-44	బీట్‌రూట్	38
కాకర కాయలు	40	కీరా దోస	38
బీరకాయలు	34	ఫ్రెంచ్‌బీన్స్	104
బీరకాయలు (పందిరి)	54	అల్లం	170
క్యాబేజీ	32	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	38	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	32	తోటకూర	08
ఉల్లిపాయలు	25	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనబకాయ (1)	15	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	15-20	చిలకడదుంప	30

30,240 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

భీమడోలు: ఏలూరు జిల్లా వ్యాప్తంగా దాళ్వాలో ఇప్పటి వరకు 30,240 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసామని జిల్లా వ్యవసాయాధికారి డాక్టర్ షేక్ హబీబ్ బాషా అన్నారు. గుండుగొలనులో వరి కోతల తర్వాత తేమశాతం తగ్గించేందుకు కళ్లాల్లో ఆరబోసిన ధాన్యాన్ని గురువారం ఆయన పరిశీలించారు. రైతుల నుంచి ధాన్యం సేకరణపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. భీమడోలు మండలంలోని వరి కోతలు, ధాన్యం సేకరణ, మిల్లులకు తరలింపు తదితర అంశాలపై ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి నుంచి వివరాలు తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా 8,783 ఎకరాల్లో వరి కోతలు పూర్తి కాగా 9830 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు పంపించామని ఏఓ డీఏవోకు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 27,240 ఎకరాల్లో వరి కోతలు 40శాతం పూర్తయ్యాయని హబీబ్‌బాషా తెలిపారు. జిల్లాలోని ఆర్‌బీకేల్లో 18,32,560 గోనె సంచులు అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి గింజను కొనుగోలు చేస్తామని, ప్రతి బస్తాకు మద్దతు ధరకే ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. దళారులను నమ్మి మోసం పోవద్దన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ ఏవో ప్రవీణ్, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలే స్ఫూర్తి



అంబేడ్కర్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న యూనియన్ బ్యాంక్ ఆర్ఎం శ్రీనివాస్, జేడీ వి.జయప్రకాష్

ఏలూరు (టూటౌన్): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా పిల్లలను తీర్చిదిద్దాలని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్ఎం ఎన్ శ్రీనివాసరావు సూచించారు. స్థానిక అమీనాపేట ఏటిగట్టు ప్రాంతంలోని సాంఘిక సంక్షేమ శాఖ సమీకృత బాలుర వసతి గృహంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సామాజిక బాధ్యతగా తమ బ్యాంకు ద్వారా గతేడాది ఈ హాస్టల్‌కు ఫ్యాన్లు, ట్యూబ్ లైట్లు అందించగా, ఈ ఏడాది రూ.30 వేలు విలువ చేసే వాటర్ ప్యూరీఫైర్‌ను అందిచామన్నారు. హాస్టల్ కిచెన్ రూమ్‌లో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరీఫైర్‌ను యూనియన్ బ్యాంక్ ఆర్ఎం ఎస్.శ్రీనివాస్ ప్రారంభించారు. సాంఘిక సంక్షేమ శాఖ జేడీ వి.జయప్రకాష్ మాట్లాడుతూ యూనియన్ బ్యాంకు తోడ్పాటును అభినందించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎంలు సంతోష్, ఎస్ కిరణ్, ఏఎస్‌డబ్ల్యూఓ బి.రమేష్, హాస్టల్ వార్డెన్ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.